జాతీయ వార్త ను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 30-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 525 పేజీలు: 4 వెల : రూ.7

## డబుల్ ఇంజిన్ సర్కార్‌తో..
# ఏపీ అభివృద్ధి



* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు * గార మండలంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు * ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి

శ్రీకాకుళం, నవంబరు29 (వార్త): డబుల్ ఇంజన్ సర్కారు తోడ్పాటుతో రాష్ట్రం రెట్టింపు వేగంతో మరింత అభివృద్ధి వైపు పయనిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా గార మండలంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. తొలుత వమరవల్లి డైట్ పాఠశాలలో అదనపు భవనాలకు 2.4 కోట్లు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తయిన అదనపు తరగతి గదులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. నూతన భవనాల్లో ఏర్పాటు చేసిన వసతులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది విద్యార్థులకు సేవలు అందే విధంగా పలు సూచనలు చేశారు. అదనపు తరగతి గదుల్లో బోధనా గదులు 2, స్మార్ట్ క్లాస్ గదులు 2, కంప్యూటర్ ల్యాబ్ కమ్ ఐటి ల్యాబ్, సైన్స్ ల్యాబ్, మ్యాథ్స్ ల్యాబ్ లాంగ్వేజ్ ల్యాబ్, సోషల్ సైన్సెస్ ల్యాబ్, వర్క్ ఎక్స్‌పీరియన్స్‌కు ల్యాబ్, ఫిజికల్ లిటరసీ ల్యాబ్, గర్ల్స్ వాల్టింగ్ హాల్‌లతో కలిపి ఈ భవనాలను 2.40 కోట్ల రూపాయలతో నిర్మించారు. భవనంలోని గదులు పరిశీలించిన కేంద్ర మంత్రి.. అందించిన వసతులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇదే ప్రాంగణంలో ఆడిటోరియం, రెండు డార్మిటరీలు గ్రౌండ్ ఫ్లోర్ లో అన్ని వసతులతో కూడిన 4 గదులు, మొదటి అంతస్తులో 4 గదుల డిజైన్ తో 6.06 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న భవన సముదాయానికి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులు 40 లక్షలతో గార మండల కేంద్రంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. గదులను పరిశీలించి సౌకర్యంగా ఉన్నాయని కితాబిచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని చాపురం, పాత్రునివలస గ్రామాల్లో రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొనడంతో పాటు డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శ్రీకాకుళం నగరంలోని పిఎస్ఎన్ఏం పాఠశాల ఎదురుగా రోడ్డుతో పాటు, స్వర్గీయ కింజరాపు ఎర్రంనాయుడు పేరుతో నిర్మించిన పార్క్‌ను రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. పార్క్ పరిసరాలను కలియతిరిగి నిర్మాణం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో నియోజవర్గ కూటమి శ్రేణులు ఎక్కడికక్కడ ఘన స్వాగతాలు పలికారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఆలయాలను కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







## నైపుణ్య శిక్షణలో సిక్కోలుకు
# రాష్ట్రస్థాయి అవార్డు

శ్రీకాకుళం క్రైం, నవంబరు29(వార్త):రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అందిస్తున్నటువంటి వివిధ రకాల సేవలను గుర్తించి రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాకు మొదటి స్థానం దక్కింది. ఇందులో భాగంగా శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఈ అవార్డును నైపుణ్య అభివృద్ధి సంస్థ చైర్మన్ బి.శేషారావు, ఎండి అండ్ సీఈవో చేతుల మీదుగా తీసుకున్నారు. అవార్డు అందుకున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిశారు.

# థర్మల్ పవర్‌ప్లాంట్ మాకొద్దు
## అడ్డూరిపేటలో ధర్నా చేసిన గ్రామస్థులు

బూర్జ, నవంబరు 29 (వార్త): సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దులో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేయాలని పోరాట కమిటీ నాయకులు శనివారం అడ్డూరిపేట గ్రామంలో ధర్నా చేశారు. పవర్‌ప్లాంట్ ప్రతిపాదిత ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్‌దొర, కార్యదర్శి సవర సింహాచలం, కోశాధికారి రవికాంత్, ఉపాధ్యక్షులు మిన్నారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



## గంజాయి రవాణాపై..
# ఉక్కు పాదం

* పలుచోట్ల హాట్‌స్పాట్‌లు గుర్తింపు
* 65 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* గంజాయి విక్రయం, నిషేధంపై ప్రజల సహకారం కీలకం
* పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ అభ్యుదయం యాత్ర
* ప్రతి శనివారం విద్యాసంస్థల్లో అవగాహన సదస్సు
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
* జిల్లా నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 29(వార్త): జిల్లాలో గంజాయి వినియోగం, అక్రమ రవాణాను సమూలంగా అరికట్టేందుకు అధికారులు గుర్తించిన 65 హాట్‌స్పాట్‌ల వద్ద సీసీ కెమెరాలను తక్షణమే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కెమెరాల ఏర్పాటు బాధ్యతను స్థానిక సంస్థలు తీసుకోవాలని చెప్పారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలసి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 16 మండలాల్లో గంజాయి కార్యకలాపాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న మొత్తం 65 హాట్‌స్పాట్‌లను అధికారులు గుర్తించారు. వీటిలో శ్రీకాకుళం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత వంతెన వద్ద రివర్ బెడ్, దమ్మల వీధి వాటర్‌ట్యాంక్, ఏపీ హెచ్‌బీ పార్క్ వెనుక భాగం, ఆర్టీసీ కాంప్లెక్స్ పాత భవనాల వెనుక భాగం వంటి ప్రదేశాలు ఉన్నాయి. ఇప్పటివరకు కేవలం 32 ప్రాంతాల నుంచి మాత్రమే కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని, కేవలం 3 మాత్రమే ఏర్పాటు చేశారని ఎస్పీ నివేదించినట్లు తెలిపారు. మిగిలిన ప్రతిపాదనలను వచ్చే రెండు రోజుల్లో పంపించి, పనులను సత్వరం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ హాట్‌స్పాట్‌లలో నిత్యం మానిటరింగ్ చేయడం ద్వారా విద్యార్థులు, కూలీలు, డ్రైవర్లు వంటి వర్గాలను లక్ష్యంగా చేసుకునే రవాణాదారులను కట్టడి చేయవచ్చని అధికారులు ఉద్దేశించారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి విక్రయం, నిషేధంపై ప్రజల సహకారం కీలకమని తెలిపారు. మాదకద్రవ్యాల సమాచారం వెంటనే డయల్ 112 ద్వారా లేదా ప్రత్యేక హెల్ప్‌లైన్ల ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయాలని డీపీఓ, మున్సిపల్ కమిషనర్లను కోరారు. అలాగే, అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్ట్‌లను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. 38 ప్రభుత్వ, 67 ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో సహా అన్ని ఇంటర్మీడియట్ కళాశాలల్లో గంజాయి నివారణ కోసం ఈగల్ టీమ్‌లను ఏర్పాటు చేయాలనీ, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించే విషయంలో ఐతం, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల కృషిని కలెక్టర్ అభినందించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు ప్రతి శనివారం తప్పనిసరిగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు హోంమంత్రి ప్రారంభించిన పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు 'అభ్యుదయం' సైకిల్ యాత్ర లో జిల్లా ప్రజలు, ఆసక్తి గలవారు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎస్పీ కోరారు. రహదారుల భద్రతపై జరిగిన సమీక్షలో.. శ్రీకాకుళం నవభారత జంక్షన్-బైపాస్ జంక్షన్ వద్ద పాదచారుల భద్రత కోసం వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేయాలని ఎస్పీ కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ప్రైవేట్ బస్సులు నిలపకుండా కేసులు నమోదు చేయాలని, రోడ్లపై ఇష్టానుసారం వాహనాలు పార్క్ చేసినా, జాతీయ రహదారిపై చెత్త వేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పోలీస్, విద్యా, వైద్య ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.





# కంటైనర్ దగ్ధం

* ఒడిశాలోని గంజాం జిల్లా, కొనిసి హైవేపై ప్రమాదం
* తృటిలో తప్పించుకున్న డ్రైవర్, క్లీనర్
* డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు
* కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం, నవంబరు 29 (వార్త): కొనిసి జాతీయ రహదారి-16పై ఆంధ్రా నుంచి ఒడిశావైపు వెళ్తున్న కంటైనర్‌లో శనివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బ్రహ్మపుర ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## విద్యార్థులకు సన్మానం

**పలాస, నవంబరు 29 (వార్త):** జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు వారి గెలుపునకు కృషి చేసిన పీడీ పద్మాలోచనకు, ప్రధానోపాధ్యాయులు వీర్రాజుకు బొడ్డపాడులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు అవకాశం లేనప్పటికీ, కృషితో పట్టుదలగా క్రీడల్లో రాణించి గ్రామ పేరును నిలబట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కిక్కర ఢిల్లీరావు, ఎస్ఎంసి చైర్మన్ గర్తం తులసిరావు, 7వ వార్డ్ మెంబెర్ మురుపింటి కుమార్ రాజ్, గ్రామ పెద్దలు బొడ్డు సింహాద్రి, బొడ్డు మోహన్ రావు, తెప్పల చిట్టిబాబు, పోతనపల్లి చిరంజీవి, బొడ్డు జగన్, పోతనపల్లి జగదీశ్, తామాడ గంగయ్య, బొడ్డు శ్రీనివాస్, తామాడ ధర్మారావు, తంగుడు చంద్రశేఖర్, పోతనపల్లి కాంతారావు, బొడ్డు పాపారావు (అండమాన్), బొడ్డు పాపారావు, నిరంజన్ పాణిగ్రాహీ, నౌగాపు గంగాధర్ తల్లి తండ్రులు సార సోమేశ్ గీతాంజలి, జుత్తు శ్రీదేవి, రాపాక జగదీశ్, రాపాక సోమేశ్ (రైల్వే), సార వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.






## సేవలు మరింత సులభతరం
### వాట్సాప్ గవర్నన్స్‌కు ఎమ్మెల్యే గౌతు శిరీష శ్రీకారం

**పలాస, నవంబరు 29 (వార్త):** ప్రజా సమస్యల పరిష్కారం మరింత వేగవంతం చేసేందుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వినూత్న కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. ప్రతివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరుకాలేని వారికి తీయని వార్త అందించారు. వాట్సాప్ గవర్నన్స్ తీసుకువచ్చారు. ఏ సమస్య ఉన్నా వాట్సాప్‌లో సమాచారం అందిస్తే పరిష్కారం చూపనున్నారు. మన గౌతు శిరీష ఎమ్మెల్యే పలాస పేరిట ఉన్న 97524 85999 నంబర్‌కు సమస్యలు పంపించవచ్చని ఎమ్మెల్యే శిరీష స్పష్టం చేశారు. ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు కార్యాలయానికి రాలేని పరిస్థితులున్న నేపథ్యంలో వారికి ఈ వాట్సాప్ గవర్నన్స్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పలాస ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పీరుకట్ల విఠల్, శశి భూషణ్, దువ్వాడ హేమబాబు చౌదరి, జి సూర్యనారాయణ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ భూతాన్ని తరిమికొట్టాలి




**పలాస, నవంబరు29(వార్త):** సమాజం నుంచి ఎయిడ్స్ భూతాన్ని తరిమి కొట్టాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 1న జరగబోయే జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. వెంకటలక్ష్మి అధ్యక్షతన విద్యార్థులు పలాస పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ద్వారా ప్రజలకు ఎయిడ్స్ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సందేశాలు అందించారు. కళాశాల ప్రాంగణంలో హెచ్ఐవి/ఎయిడ్స్ అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన పోస్టర్ ప్రదర్శన, తదితర పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రథమ స్థానాన్ని ద్వితీయ సంవత్సరం జువాలజీ విద్యార్థిని గాయత్రీ గౌమాంగో, ద్వితీయ బహుమతి అనూష మహేరాణా, తృతీయ బహుమతిని ప్రథమ సంవత్సరం జువాలజీ విద్యార్థిని గౌతమీ బెహరా కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ బి. నరసింహులు, కళాశాల సైన్స్ ఇన్‌ఛార్జి శ్రీనివాస పట్నాయక్, జంతుశాస్త్ర అధ్యాపకులు ఎం. హెచ్. కె. ప్రసాద్, బి. కోదండరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. పి. మధు తదితరులు పాల్గొన్నారు.

## కాలువల్లో చెత్త చెత్తను వేయకుండా చూడాలి



**పలాస, నవంబరు29(వార్త):** కాలువలలోను, రోడ్లపైన ప్రజలు చెత్తను వేయకుండా చూడాలని, ప్రజలందరూ సహకరిస్తేనే మున్సిపాలిటీ సుందరంగా తీర్చి దిద్దేందుకు తన వంతు కృషి చేయడం జరుగుతుందని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో శానిటేషన్ జరుగుతున్న తీరును శనివారం మున్సిపల్ కమిషనర్ తమ శానిటేషన్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. పురపాలక సంఘంలోని 6వ వార్డు అంతరకుడ్డ గ్రామంలో వార్డు ఇన్చార్జితో కలిసి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలువలలోను, రోడ్లపైన ప్రజలు చెత్తను వేయకుండా శానిటేషన్ వాహనాలకు మాత్రమే చెత్తను అందించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాశీబుగ్గ స్మశాన వాటికలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ వద్ద గల అన్న కాంటీన్‌లో ప్రజలకు సరఫరా అవుతున్న ఫుడ్ క్వాలిటీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శేఖర్, శానిటేషన్ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**పలాస, నవంబరు29(వార్త):** ఇటీవల రామేశ్వరంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన పలాస మండలం పెదంచల, వీర రామచంద్ర పురం గ్రామాలకు చెందిన నవీన్, సాయి కుటుంబాలను ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శించారు. గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబాల్ని కలిసి ధైర్యం చెప్పి అన్ని విధాలుగా తోడుంటామని భరోసా ఇచ్చారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని, మీకు ఎటువంటి సహాయం కావాలన్నా నేరుగా తనని సంప్రదించాలని కోరారు. ఈమెతోపాటు టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్, టిడిపి కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



# క్రీడలు ఆరోగ్యానికి దోహదం

* మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు * హరిపురంలో ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు ప్రారంభం



**మందస, నవంబరు 29(వార్త):** మందస మండలంలో పనిచేసిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, హైస్కూల్ ప్రధా నోపాధ్యాయులకు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్-2025 హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు ప్రారంభించారు. మండలస్థాయి ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు మండల విద్యాశాఖ అధికారి మర్రిపాటి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు ప్రారంభించగా ఈ పోటీలలో ఆరుగురు సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు, నలుగురు నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు, లాంగ్వేజ్ ఉపాధ్యాయులు, నలుగురు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల నుండి ఒకరు, ప్రధానోపాధ్యాయులు లేదా మండల విద్యాశాఖ అధికారి నుండి ఒక్కరిని ఎంపిక చేశారు. ఉపాధ్యాయుల క్రీడా సామర్థ్యాన్ని పరీక్షించి బౌలింగ్ లో నలుగురు, బ్యాటింగ్ లో నలుగురు, ఆల్ రౌండ్ డ్రెస్ నలుగురు, కీపింగ్ నుండి ఇద్దరు ఉపాధ్యాయులను మొత్తం 16 మందిని క్రికెట్ ఆడేందుకు మండల స్థాయి నుండి డివిజనల్ స్థాయి వరకు పంపించుటకు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. మండలంలో పనిచేస్తున్న సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, ప్రధానోపాధ్యాయులందరూ కూడా హాజరై, వారి క్రీడా సామర్థ్యాన్ని ప్రదర్శించగా, నైపుణ్యం గల క్రీడాకారులని ఎంపిక చేయడం జరిగిందని ఎంఈఓ లక్ష్మణరావు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి గోపీచంద్, ఎం. శ్రీనివాసరావు, సత్యజిత్ రాయ్ హాజరయ్యారు. ఉపాధ్యాయ క్రీడాకారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

### చీపి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అభినందన

మండలంలోని చీపి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడలలో సత్తా చాటారు. జీఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీలలో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీనియర్ ఖోఖో, జూనియర్ ఖోఖో, సీనియర్ వాలీబాల్ లో ప్రథమ స్థానం, జూనియర్ వాలీబాల్ తృతీయ స్థానం సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. ఘనత సాధనకు కృషి చేసిన పీఈటీ పి.రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ఆటలలో మరింత రాణించాలని ప్రధానోపాధ్యాయుడు కె.సురేంద్రకుమార్ కోరారు.





## జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ

**సోంపేట నవంబరు 29(వార్త):** సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని శాసనపురి శైలజ క్రీడా పోటీల్లో ప్రతిభ సాధించారు. శ్రీకాకుళంలో జరిగిన ఖేల్ ఇండియా అండర్ 16 డిస్క్ త్రో ఈవెంట్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. అలాగే గుంటూరులో జరిగిన స్టేట్ లెవెల్ స్కూల్ గేమ్స్ అండర్ 16 లో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శైలజను శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ మోహన్‌రావుతో పాటు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎంఓ రజిని కుమారి, రామినాయుడు, ప్రసాద్, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

## పలాస మండల క్రీడా పోటీలకు ఎంపికలు



**పలాస, నవంబరు 29 (వార్త):** పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండవ రోజు శనివారం జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి2 బి.సత్యం పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్ అధ్యక్షత వహించారు. శనివారం జరిగిన బాలికల కబడ్డీ పోటీల్లో సీనియర్ విభాగం రంగోయి, ఎం జె పి పలాస, జూనియర్ విభాగంలో బొడ్డపాడు, ఎం జె పి పలాస, బాలురు విభాగంలో వాలీబాల్‌లో ఎస్ఎఫ్ఎస్ కాశీబుగ్గ, జిహెచ్ఎస్ పలాస, జూనియర్ విభాగంలో జిహెచ్ఎస్ పలాస, శ్రీ గురుకుల కాశీబుగ్గ గెలిచి డిసెంబర్లో జరిగే గ్రిగ్స్ పోటీలకు ఎంపికయ్యాని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య తెలిపారు. న్యాయ నిర్ణయితలుగా సిహెచ్ పద్మలోచన, ఎస్ చంద్రశేఖర్, సిహెచ్ రామ్, బి.శంకర్రావు, ఆర్.శ్రీనివాసరావు, వై.కె. హరినాథ్ ,టి. గణేష్, బి. రవికాంత్, టి.గీత, రాజేశ్వరి బి. తిరుమల రావు వ్యవహరించారు.

### క్రీడా విజేతలకు సన్మానం



పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన క్రీడా విజేతలకు శనివారం గ్రామస్తులు సన్మానం చేశారు. కబాడీ పోటీల్లో అండర్ 14 విభాగంలో జాతీయ స్థాయిలో జుట్టు భాగ్యరాజు సిల్వర్ మెడల్‌ను, బాలికల విభాగంలో జాతీయస్థాయిలో కబడ్డీ పోటీల్లో సారా అశ్రుత సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. క్రికెట్‌లో రాపాక సాహిల్ రాష్ట్రానికి ఎంపికయ్యారు.

# ఆధునిక పద్ధతులతో వ్యవసాయం మేలు

* ఇదే కూటమి ప్రభుత్వం ధ్యేయం
* పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**మందస, నవంబరు 29(వార్త):** ఆధునిక పద్ధతులతో రైతులు వ్యవసాయం చేయాలని, దీంతో అధిక దిగుబడులు సాధిస్తారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని కొండలోగాంలో రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఉంటుందన్నారు. రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందజేయడం జరుగుతోందన్నారు. అంతేకాకుండా రైతులకు అన్ని విధాలా సాయం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం రైతుల ఆదాయం పెరిగి, రైతులకు మంచి ఆదాయం పొందే మార్గాలను అన్వేషిస్తుందన్నారు. రైతులు సంప్రదాయ వ్యవసాయం చేస్తూ ఆదాయం పొందే మార్గాలను కూడా చూడాలని, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి లబ్ది పొందాలని రైతులను కోరారు. రాష్ట్రంలో రైతును రాజుగా మార్చాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులు ఆధునిక వ్యవసాయం మెళుకువలు నేర్చుకోవాలని, లాభసాటి వ్యవసాయ పద్ధతిలో రైతులు ముందుకు వెళ్లాలని కోరారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మల్ల శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఏడి మండేలా రామారావు, పీరకట్ల విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, దాసరి తాతారావు, తమరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, మోహనరావు, కొర్ల విష్ణు, మాధవరావు, జనసేన నాయకుడు కుప్పాయి గోపాలరావు, సంతోష్ కుమార్ పండా, రట్టి లింగరాజు, ముంజేటి చంద్రశేఖర్, నవీన్ కుమార్ యాదవ్, రెవెన్యూ సిబ్బంది వ్యవసాయ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది,ఇతర నాయకులు రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**జి.సిగడాం, నవంబరు 29(వార్త):** పెంట రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహశీల్దార్ ఎం.సరిత పరిశీలించారు. కొనుగోలు కేంద్రం ఏర్పాట్లపై ఏవో బి.బాబ్జిని ఆరా తీశారు. కేంద్రంలో రైతులకు కల్పించిన సౌకర్యాలు, ధాన్యం తేమ శాతాన్ని ఆమె పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లుకు రవాణా చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైసుమిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుభ్రం చేసేందుకు ప్యాడీ క్లీనర్‌ను, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వారికి కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వారి వెంట మక్క నారాయణరావు, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ కుసుమ, ప్రొక్యూర్‌మెంట్ టిఏ మీసాల అశోక్, అలుగోలు సుధాకర్, సింహాద్రివాసు, సంతు రైతులు పాల్గొన్నారు.

## హరిపురం జడ్పీహెచ్ఎస్ ప్లస్‌లో పాల్ ల్యాబ్ ప్రారంభం

**మందస, నవంబరు 29(వార్త):** మందస మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో పాల్ ల్యాబ్ మండల మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మణరావు ప్రారంభిచారు. కార్యక్రమంలో మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మక్కా శ్రీనివాస రావు, బేతాళపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బైరి సత్యజిత్ రాయ్, హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొడ్డేపల్లి గోపీచంద్, గణిత, ఇంగ్లీష్, తెలుగు ఉపాధ్యాయుడు దున్న కృష్ణారావు, వై.రవికుమార్, ఎల్. సాంబమూర్తి తదితర ఉపాధ్యాయుల సమక్షంలో ల్యాబ్ ను ప్రారంభిచారు. పాల్ లాబ్ లో ప్రభుత్వం 30 ట్యాబులను పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసింది. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధికై ఇవి ఎంతో ఉపయోగపడతాయని మండలం విద్యాశాఖాధికారి మర్రిపాటి.లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులు సరైన రీతిలో ఉపయోగించుకొని జ్ఞాన సముపార్జన చేయాలని ఆయన పిలుపునిచ్చారు.





## రైతుల సమస్యల పరిష్కారమే 'రైతన్న మీకోసం'



**మెళియాపుట్టి, నవంబరు29 (వార్త):** గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే ధ్యేయంతో కూటమి ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని గ్రామాలలో ఉన్న రైతాంగ సమస్యలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకొని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని గిరిజన సంఘ నాయకులు బైరిసింగి ధరణి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో మెళియాపుట్టి మండలంలో గల రామచంద్రపురం గ్రామంలో శనివారం రైతన్న.. మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతన్నల దగ్గరికి వెళ్లి రైతన్న మీకోసం కార్యక్రమం గురించి తెలియపరిచారు. ధరణితోపాటు జడ్పిటిసి సభ్యులు గూడ ఎండయ్య, కొతూరు సర్పంచ్ వసంత కుమారి రైతులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ నాయకులు లక్ష్మీపురం కిరణ్ ఆధ్వర్యంలో పరుశురాంపురం పంచాయతీలో గల నందవ, హీరాపురం, పెద్దమడి, చీపురుపల్లి తదితర గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారితోపాటు టిడిపి నాయకులు పొట్నూరు రాజు, శంకర్, శ్రీను రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులున్నారు.

## కొన్నాయి పుట్టుకలో సీసీ రోడ్డు నిర్మాణం



**కంచిలి నవంబరు 29(వార్త):** కంచిలి మండలం కొన్నాయి పుట్టుగా గ్రామంలో శనివారం సిసి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. గ్రామస్తులు కోరిన రోడ్డు నిర్మాణం పట్ల మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు కృషి చేశారు. రోడ్డు నిర్మాణానికి ఆయన అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. గ్రామ పెద్దలు శ్రీను, భైరవ్, భగవాన్, రత్నాకర్, రూప్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ ఫెస్టివల్‌లో రుచులు అదుర్స్

**కంచిలి నవంబర్ 29(వార్త):** జాడుపూడి పంచాయతీ పరిధిలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం పండగ వాతావరణాన్ని తలపించింది. వంటల్లో నూనె వాడకాన్ని తగ్గిస్తూ పౌష్టికాహార తయారీపై అవగాహన కల్పించారు. ఈ మేరకు శనివారం ఆర్‌వీఎం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంచార్జి ప్రిన్సిపాల్ వాణికుమారి ఆధ్వర్యంలో పాఠశాలలో జరిగిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో బాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని మంచి పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని తగ్గిస్తూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తూ పలు రుచికరమైన వంటకాలను, ఫ్రూట్ సలాడ్లను తయారుచేసి విద్యార్థినులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంపై తల్లిదండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు. చదువుతోపాటుగా అన్ని రంగాల్లో విద్యార్థులు ముందంజలో ఉండాలని రాజీవ్ విద్యా మిషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ సభ్యులతో పాటుగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని బాలికలు తయారుచేసిన రుచికరమైన తినుబండరాలు, పళ్ళతో తయారుచేసిన సలాడ్లు రుచి చూసి విద్యార్థినిలకు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇష్టపడి ఏ పని చేసిన ఖచ్చితంగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని ఆకాంక్షించారు. నేడు సమాజంలో అన్ని రంగాలలో బాలికలే ముందంజలో ఉన్నారని గుర్తు చేశారు. రానున్న పబ్లిక్ పరీక్షలలో ఇష్టపడి చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత చెందాలని పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయ అధ్యాపక సిబ్బంది విద్యా కమిటీ సభ్యులు పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం

**కొత్తూరు, నవంబరు 29 (వార్త):** కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా చేతులెత్తేసిందని, దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. పంట కొనుగోలులో చంద్రబాబు ప్రభుత్వం కనీస చిత్తశుద్ధి చూపడం లేదని, ఇది ప్రభుత్వ కుట్రలో భాగమేనని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు, రవాణా వాహనాలు లేకపోవడంపై మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఆర్బీకేలు, సొసైటీలు కేవలం ఉత్సవ కేంద్రాలుగా మారాయని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ఏ దశలోనూ ప్రభుత్వ పర్యవేక్షణ కనిపించడం లేదని, మిల్లులు, దళారుల ఇష్టారాజ్యానికి పచ్చజెండా ఊపడం ప్రభుత్వ వైఫల్యాన్ని తెలియజేస్తోందన్నారు. ప్రభుత్వ కుట్రలకు తోడు, రాబోయే తుపాను హెచ్చరికలు అన్నదాతల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో తక్షణమే ప్రభుత్వం మేల్కొని ధాన్యం కొనుగోళ్లను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. దళారులు అతి తక్కువ ధరకు ధాన్యాన్ని అడుగుతూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. 75 కిలోల ధాన్యం బస్తాకు రైతులు రూ.400 నుండి రూ.500 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లులోకి నేరుగా రైతు ప్రవేశించే పరిస్థితి లేకపోవడం, దళారుల ప్రాబల్యం పెరగడం ప్రభుత్వ పర్యవేక్షణ ఎంత లోపభూయిష్టంగా ఉందో తెలియజేస్తోందని అన్నారు.

# ‘సోమేశ్వరరావు’ సేవలు చిరస్మరణీయం

- మాజీ మంత్రి గౌతు శివాజీ
- ‘యెరుకోల’కు ఘనంగా నివాళులు

**మందస, నవంబరు 29(వార్త):** ఉపాధ్యాయునిగా యెరుకోల సోమేశ్వరరావు సమాజాన్ని బాగు చేయడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. మందస మండలంలోని హరిపురం గున్నయ్యనగర్లో రిటైర్డ్ ఉపాధ్యాయుడు, సోషల్ వర్కర్, విద్యాధికుడు యెరుకోల సోమేశ్వరరావు సంతాప సభ ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం, శాతవాహన విద్యాసంస్థలు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో శివాజీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సోమేశ్వరరావు ఎందరినో మంచి పౌరులుగా తీర్చిదిద్దారరన్నారు. ఒక పక్క విద్యను నేర్పుతునే మరో పక్క సమాజితహితమైన కార్యక్రమాలు చేశారన్నారు. సౌమ్యునిగా, ఎంతో మంచిమనిషిగా.. పలువురికి సాయం చేసేవారన్నారు. సోమేశ్వరరావు మరణం తీరనిలోటన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా సోమేశ్వరరావు సమాజానికి ఎన్నో మంచి సేవలందించారన్నారు. ఈ ప్రాంతంలో ఎందరో ఆయన శిష్యులు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. అంకితభావంతో ఉద్యోగాన్ని చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సోమేశ్వరరావు కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంపోలు త్రినాథరావు, వాయిలపల్లి నారాయణరావు, కొంచాడ జగ్గన్న, బనిశెట్టి చిన్నయ్య, మజ్జి బాబురావు, దువ్వ రామారావు, గొర్లె సాంబమూర్తి, కొర్ల పాపారావు, శాతావాహన విద్యాసంస్థల డైరక్టర్ ముంజేటి పాపారావు, గ్రామపెద్దలు పుల్లా వాసుదేవరావు, భైరిశెట్టి గున్నయ్య, మాజీ ఎంఈఓ గుంట చక్రపాణి, టీడీపీ నాయకులు లబ్బ రుద్రయ్య, చౌదరి మురళీకృష్ణ, సోమేశ్వరరావు శిష్యులు, ఆయన భార్య యెరుకోల విజయలక్ష్మి, కుమారుడు వెంకటసమీర్ చక్రవర్తి, సోదరులు మోహనరావు, సత్యన్నారాయణమూర్తి, రమణారావు, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.



# మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**సారవకోట/జలుమూరు, నవంబర్ 29(వార్త):** సారవకోట మండల కేంద్రంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ప్రాణదాతలుగా నిలవాలని తెలిపారు. అన్ని దానాల్లో కన్నా రక్తదానం మిన్న అని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి కారణంగా ప్రతి ఒక్కరూ వ్యాధుల బారిన పడుతున్నారని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్యపరీక్ష నిమిత్తం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 24 గంటలు ప్రతి ఒక్కరు పని నిర్వహణలో నిమగ్నమై ఉంటారన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.






### రైతును రాజును చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రపంచానికి ఆహారాన్ని అందించే రైతును రాజును చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం సారవకోట మండలం, గొర్రిబంద పంచాయతీ, బురజవాడ గ్రామంలో నిర్వహించిన ‘రైతన్న... మీకోసం’ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయం, మెలకువలు నేర్చుకోవాలని, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీపీ, తహశీల్దార్, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ఆటల పోటీలు ప్రారంభం

**నరసన్నపేట/జలుమూరు, నవంబర్ 29(వార్త):** నరసన్నపేట మండలం ఉపాధ్యాయుల ఆటల పోటీలను శనివారం ప్రారంభించారు. నరసన్నపేట జూనియర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. మండలంలో గల ఉపాధ్యాయులు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులు త్రోబాల్ క్రీడల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు జట్లుగా ఈ పోటీలలో పాల్గొంటున్నారు. గెలుపొందిన టీంలకు బహుమతులు అందజేస్తారు. క్రీడలు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని ఎంఈఓ శాంతారావు అన్నారు.




## స్మశాన వాటిక ఏర్పాటుకు వినతి

**నరసన్నపేట/జలుమూరు, నవంబర్ 29 (వార్త):** నరసన్నపేట మండలం జమ్మూ పంచాయతీ గడ్డయ్యపేట వద్ద ఉన్న జగనన్న కాలనీలో స్మశాన వాటిక లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ జగనన్న కాలనీ సందర్శించారు. స్థానిక మహిళలు ఆయన వద్దకు వెళ్లి మౌలిక వసతులు లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు.



## ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యంపై రైతు ఆవేదన

**నరసన్నపేట/జలుమూరు, నవంబర్29 (వార్త):** నరసన్న పేట మండలం కరగాం గ్రామానికి చెందిన రైతు పాగోటి వెంకట రమణ ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యం పై తన ఆవేదనను వ్యక్తం చేశారు. గత వారం రోజుల నుంచి ధాన్యం కొనుగోలుపై గందరగోళం నెల కొందని, ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. మిల్లర్ల దోపిడీని నిరోధించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తేమ పేరిట 3 నుంచి 6 కేజీల ధాన్యం అధికంగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## మండల స్థాయి గ్రిగ్స్ పోటీలలో ప్రతిభ




**నరసన్నపేట/జలుమూరు, నవంబర్ 29(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రిగ్స్ ఆటల పోటీలలో సత్తా చాటారు. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో మండల స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, పీడీలు ఎం.వి రమణ, కె. గణపతిరావు, పాఠశాల హెచ్ఎం పైడి వెంకట్రావు శనివారం అభినందించారు. క్రీడల్లో ప్రోత్సహించడం వల్ల ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన



**నరసన్నపేట/జలుమూరు, నవంబర్ 29(వార్త):** జమ్ము జంక్షన్లోని ఓ పాఠశాలలో విద్యా ర్థులకు రోడ్డు భద్రతపై టెక్కలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంజీవరావు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ప్రయా ణించే బస్సుల్లో ప్రాథమిక చికిత్స కిట్లను తప్పనిసరిగా ఉండాలని సూచించారు. డ్రైవర్ ఆరోగ్య పరి స్థితిని, బస్సు కండిషన్ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాల కుమార్, సిబ్బంది, విద్యార్థులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలలో విజేత పాగోడు

**జలుమూరు, నవంబర్ 29(వార్త):** జలుమూరు మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎన్వీఆర్ఎస్ ప్రసాద్ రావు తెలిపారు. శుక్రవారం జలుమూరు కరవంజ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీలలో భాగంగా కబడ్డీ పోటీలలో పాగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించారని తెలియజేశారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు లోకేశ్వరిని ఉపాధ్యాయులు అభినందించారు.



## పోలాకి డిప్యూటీ ఎంపీడీవోగా సంధ్యారాణి

**పోలాకి/జలుమూరు, నవంబర్ 29(వార్త):** పోలాకి డిప్యూటీ ఎంపీడీవోగా సంధ్యారాణి విధుల్లో చేరారు. ఆమె మాట్లాడుతూ గతంలో తాను నరసన్నపేటలో పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. ఇటీవల జరిగిన పదోన్నతులలో భాగంగా తనను డిప్యూటీ ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. విధులలో చిత్తశుద్ధిగా పనిచేస్తానని పేర్కొన్నారు.

## విద్య సామర్థ్యాలపై దృష్టి సారించండి

**జలుమూరు, నవంబర్ 29(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య సామర్థ్యాలపై మరింత దృష్టి సారించాలని %వీజూ% బమ్మిడి మాధవరావు తెలిపారు. శనివారం జలుమూలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు అసెస్మెంట్ రికార్డులు పూర్తి చేసే దిశగా తగు సూచనలు, సలహాలు విద్యార్థులకు అందించాలన్నారు. ఉపాధ్యాయుడు రామారావు పాల్గొన్నారు.



## మంత్రి కొల్లిని కలిసిన ‘కొండ’



**ఇచ్ఛాపురం, నవంబరు 29(వార్త):** విజయవాడలో గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను క్యాంప్ ఆఫీసులో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రెడ్డిక బిసి కార్పొరేషన్ చైర్మన్ గా తనను నియమించినందుకు కొల్లు రవీంద్ర అభినందనలు తెలియజేశారు.



## జెమ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**సోంపేట, నవంబరు 29 (వార్త):** రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోంపేట పట్టణంలోని బీన వీధిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో హాజరైన 140 మంది రోగులకు బిపి షుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు. దీంతోపాటు సాధారణ పరీక్షలు జరిపి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులను జెమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, పిఆర్ఓ గోపి, ప్రసాద్, సాయి సురేష్ స్థానిక నిర్వాహకులు బీన ఆనంద్, పొందూరు రాజు, బీన ఈశ్వరరావు, దున్న జోగారావు, కాంచన రాఘవ దాసు, దేవాడ మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

## చైర్పర్సన్‌కు సంతకాల పత్రాల అప్పగింత



**సోంపేట, నవంబరు29 (వార్త):** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోంపేట పట్టణ వైసీపీ నేతలు సేకరించిన ప్రజా సంతకాలతో కూడిన పత్రాలను జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయకు శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇటువంటి రాష్ట్ర ప్రాయోజిత కార్యక్రమంలో పాలుపంచుకున్నందుకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. కుట్రలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని సాగనంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, పొడుపు పొడుగు కామేష్, పొందూరు బాలరాజు, మామిడిపల్లి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా మందస మండల సమావేశం




**మందస, నవంబరు 29(వార్త):** మందస మండల సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ప్రజా సమస్యలపై నిలదీయాల్సిన ప్రతినిధులు, ప్రతిపక్షం సరైన రీతిలో స్పందించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. పాడి రైతులకు మినీ గోకులాల మంజూరులో రాజకీయాలు ఎందుకని, అధికార పార్టీ అండదండలు ఉన్నవారికే మందస మండలంలో మినీ గోకులాలు మంజూరు చేశారని పలువురు ఎంపీటీసీలు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సాంకేతిక సమస్యలు పరిష్కరించి, గందరగోళం లేకుండా రైతులకు సేవలందించాలని కోరారు. ఏఎన్ఎంల కొరత వేధిస్తుందని, సాబకోట సచివాలయంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలన్నారు. చిన్నకోష్ట ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలకు చర్మ సంబంధిత ఆరోగ్య సమస్యలు తన పరిశీలనలో తన దృష్టికి వచ్చాయని, సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో వై.వెంకటరమణ సభ దృష్టికి తీసుకు వచ్చి, సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం 2025-26 సంవత్సర సవరణ బడ్జెట్, 2026-27 అంచనా బడ్జెట్ ను సభ్యులు సభలో ప్రతిపాదించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కింతలి రామకృష్ణ, ఏఓ బి.రుష్యేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలపై అవగాహన



**ఇచ్ఛాపురం, నవంబరు 29(వార్త):** రత్తకన్న హైస్కూల్‌లో యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు మాసోత్సవాలు సందర్భంగా విద్యార్థులు కు బాల కార్మికులు చట్టం బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై ట్రస్టు చైర్మన్ న్యాయవాది రాంబాబు అవ గాహన కల్పించి మొక్కలు నాటారు అలాగే స్కూల్ హెచ్ ఎం దేవరాజు మరియు ప్రేమ్ దోలయి మాట్లాడుతూ రాంబాబు చేసిన సేవలను ఆదర్శంగా ప్రతీ విద్యార్థి తీసుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోరికాన ధర్మరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్దలు పాల్గొన్నారు.

## జ్ఞాన భారతిలో 41వ వార్షిక క్రీడా దినోత్సవం

**ఇచ్ఛాపురం, నవంబరు 29(వార్త):** జ్ఞాన భారతి పాఠశాలలో పాఠశాల కార్యదర్శి సీఈవో జోహార్ ఖాన్ అధ్యక్షతన 41వ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ హాజరయ్యారు. ముందుగా సీబీఎస్ఈ క్రీడ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాకారులకు అందించారు. క్రీడాకారుల జట్ల నాయకులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. క్రీడా వేడుకలను ప్రారంభిస్తున్నట్లు ముఖ్యఅతిథి మున్సిపల్ కమిషనర్ అండ్ రమేష్ ప్రకటించారు. తర్వాత నిర్వహించిన పలు క్రీడలను అయిన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అప్పారావు, కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి పండ, మేనేజర్ ప్రమోద్ కుమార్, పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ కుమార్ పండా, డి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





# కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

**శ్రీకాకుళం, నవంబరు 29(వార్త):** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రేణులు సమష్టిగా పనిచేయాల్సివుందని ఏఐసీసీ కార్యదర్శి పాలక్‌వర్మ పార్టీ అన్నారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శనివారం మీడియాతో ఆమె మాట్లాడారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం జిల్లా నుంచి 23 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. పార్టీలో కష్టించి పనిచేసేవారికి మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని, సిఫారసులకు తావు లేదన్నారు. అందరూ పార్టీ ఆదేశాలు, నిబంధనలు అనుసరించి పనిచేయాలని సూచించారు. వ్యక్తిగత అజెండాలకు తావు లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ఛార్జి సూరత్ సింగ్ ఠాకూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శాంతకుమారి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, రామ్మోహనరావు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేయాలి

**నరసన్నపేట/జలుమూరు, నవంబర్29(వార్త):** నరసన్నపేట నియోజక వర్గంలోని బీఎల్‌వోలతో నియోజకవర్గ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ జయాదేవి శనివారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాను అన్ని గ్రామాలలో త్వరగా, సక్రమంగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. నూతన ఓటర్లను నమోదు చేసుకోవాలన్నారు. నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట మండలాలకు చెందిన బీఎల్‌వోలు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మండల గ్రిగ్స్ పోటీలు ప్రారంభం



**ఇచ్ఛాపురం, నవంబరు 29 (వార్త):** మండల గ్రిగ్స్ పోటీలు సూరంగి రాజా మైదానంలో ప్రారంభించారు. సీనియర్ బాలురు బాలికలు బ్యాట్మెంటన్, కబడ్డీ, వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె.అప్పారావు, జోన్ 1 అధ్యక్షులు కె.పద్మనాభరెడ్డి, మండల క్రీడా ఆర్గనైజర్ కృష్ణ పుడియా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పలాస ఏపీఎన్జీవో అధ్యక్షులు బోనేల గోపాల్ సత్కారం



**పలాస, నవంబరు 29(వార్త):** పలాస ఏపీఎన్జీవో అధ్యక్షులు బోనేల గోపాల్‌ను సత్కరించారు. పలాస ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులుగా రెండోసారి ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం ఆధ్వర్యంలో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలాస శ్రీనివాస్ నగర్‌లో ఉన్న అధ్యక్షుల గృహంలో శనివారం రాత్రి ఏపిటిఎఫ్, యుటిఎఫ్, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాలు, గ్రీన్ ఆర్మీ సభ్యులు కలిసి అభినందించారు. ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఇరిగేషన్ అధికారి పొట్నూరు శ్రీనివాసరావుని సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బోనేల గోపాల్ మాట్లాడుతూ పదవులు పొందడం అంటే మరింత బాధ్యత పెరిగినట్లు అని అర్థమన్నారు. సమాజ హితం కోసం చేసే పర్యావరణ బాగుకోరే మొక్కలు నాటే కార్యక్రమం మనసుకు చాలా ఆనందాన్నిస్తుందని తెలియజేశారు. ఆ దిశగా యువత ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు ఆస్పన మధుబాబు, ఏపీటీఎఫ్ నాయకులు దుంపల కృష్ణమూర్తి, అంబలి కృష్ణారావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు బల్ల చిట్టిబాబు, పీఆర్‌టీయూ నాయకులు కిషోర్ పాత్రో, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, గేదెల జగదీశ్వర్‌రావు, బీర అప్పారావు, పలాస యూత్ అసోసియేషన్ నక్క అనిల్ కుమార్, రైల్వే ఉద్యోగి డి.దామోదర్, గ్రీన్ ఆర్మీ సెక్రెటరీ బందాపు తిరుమల, సభ్యులు నూకల హేమసుందర్, కూన జనార్ధన తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



**ఇచ్ఛాపురం,నవంబరు 29(వార్త):** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. జంక్ ఫుడ్ తినడం వాళ్ల కలిగే నష్టాలను వివరిస్తూ పాఠశాల ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ విద్యార్థులు ఫుడ్ స్టాల్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు అప్పారావు, విశ్వనాథం పాల్గొని విద్యార్థుల ప్రతిభని మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యారావు, పాఠశాల మెంబెర్స్, ఒకేషనల్ టీచర్స్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 3న పార్వతీపురంలో మెగా జాబ్ మేళా



**పార్వతీపురం, నవంబరు29(వార్త):** పార్వతీపురం గాయత్రి డిగ్రీ కళాశాలలో వచ్చే నెల 3వ తేదీన మెగా జాబ్ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా , ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నిండి 30 సంవత్సరాలు ఉన్నటువంటి నిరుద్యోగ యువతి యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. అర్హులైన వారు ఆరోజు ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. 23 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ మరియు యువకులకు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 91772 97528, 89788 78557 నెంబర్లకు సంప్రదించాలన్నారు. పార్వతీపురంగాయత్రి డిగ్రీ కళాశాలలో జరగబోయే జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

# పెండింగ్ బిల్లులు ఎప్పుడు చేస్తారు?

* అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే కూన రవికుమార్
* కోరం లేక నిలిచిన 3, 5, 6 స్థాయి సంఘాల సమావేశాలు





**శ్రీకాకుళం, నవంబరు 29(వార్త):** 2012లో తొమ్మిది లక్షల రూపాయలు బిల్లులు అవ్వలేదని, ఎప్పుడు చేస్తారని ఆమదాలవలస శాసన సభ్యులు కూన రవి కుమార్ సంబంధిత అధికారులను నిలదీశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు గుర్తించాలన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి మంజూరు, నిర్మిస్తున్న గృహాల పురోగతులపై ప్రాజెక్టు డైరెక్టర్ వివరించారు. ఆర్అండ్‌బి ఎస్ఈ సత్యనారాయణ ప్రస్తుతం జరుగుతున్న పనులు, పూర్తి చేసిన పనులు, మంజూరైన పనులపై సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆమదాలవలస నియోజకవర్గంలో రహదారుల వివరాలను ఎమ్మెల్యే అడిగి చెలుసుకున్నారు. డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్ డిఆర్డిఎ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై వివరించగా, పెన్షన్లుపై ఛైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ స్పౌజ్ పెన్షన్లు ఉన్నాయని వాటిపై తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. డ్వామా పీడీ సుధాకర్ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు, ఉపాధి కార్మికులకు కల్పిస్తున్న పనులు పైన వివరించారు. శాసన సభ్యులు కూన రవి కుమార్ మాట్లాడుతూ డిశంబరు నెల నుండే పనులు ప్రారంభించాలన్నారు. సరుబుజ్జిలి జడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీలో కాలువలు పనులు చేయించక సాగునీరు రావడం లేదని తెలిపారు. ఫీడర్ పనులు చేయిస్తామని పిడి సమాధానం వివరించారు. జాబ్ కార్డులు లేని వారికి జాబ్ కార్డులు జారీ చేయాలని శాసనసభ్యులు కూన రవి కుమార్ చెప్పారు. పంచాయితీ రాజ్ ఎస్ఈ వీరన్నాయుడు మంజూరైన పంచాయతీ భవనాలు, తదితర వాటిపై తెలియజేయగా శాసన సభ్యులు కూన రవి కుమార్ మాట్లాడుతూ ఏ ఏ సంవత్సరంలో ఎన్ని పనులు మంజూరయ్యాయి, ఎన్ని పనులు జరిగాయి, ఎన్ని బిల్లులు అయ్యాయో ఆ వివరాలు వచ్చే డిఆర్సీ సమావేశం నోట్సులో ఉండాలని చెప్పారు. ఎస్డిఎఫ్ నిధులు కోసం అడిగారు. పెండింగులో ఉన్న బిల్లులు గుర్తించాలన్నారు. జలవనరుల శాఖపై ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నారాయణపురం రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల నుండి సాగునీరు విడుదల చేయాలని చెప్పారు. కలెక్టర్ తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని ఎస్ఈ తెలిపారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఎపిఈపీడిసియల్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాల శాసన సభ్యులు చెప్పారు. గ్రామీణ నీటి సరఫరా విభాగంపై పనుల పురోగతి పైన, జల జీవన్ మిషన్ పైన ఇఇ వివరించారు. ఎపిఈపీడిసియల్ కు సంబంధించి స్తంభాలను రోడ్లపై వేశారని దీని వలన ప్రమాదాలు సంభవిస్తే ప్రమాద బాధితులకు కాంపన్సేషన్ ఎవరిస్తారని, తక్షణం రహదారిపై ఉన్న స్తంభాలను మార్చాలని శాసన సభ్యులు కూన రవి కుమార్ తెలిపారు. ఉదయం జరగాల్సిన 3, 5, 6 స్థాయి సంఘాల సమావేశాలు కోరం లేక జరగలేదు. పరిశ్రమల శాఖపై సహాయ సంచాలకులు గురునాథ్ వివరించగా ఛైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఇటీవల జిల్లాకు కొత్తగా పరిశ్రమల గూర్చి అడుగగా పైడిభీమవరం, పలాసలో, పాత్రునివలసలో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు భవన నిర్మాణాలు జరుగుతున్నట్లు ఎడి వివరించారు. పంచాయతీ రాజ్ లాగ్ బుక్‌లపై సమస్యలు లేకుండా చూడాలని ఛైర్ పర్సన్ చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సత్యనారాయణ, జిల్లా అధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

* న్యాయవాదులు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి * జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా * జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం

**శ్రీకాకుళం లీగల్, నవంబరు 29(వార్త):** నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి కారణంగా ప్రతీ ఒక్కరూ వ్యాధుల బారిన పడుతున్నారని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. నగరంలోని జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ భవనంలో జిల్లా బార్ అసోసియేషన్, మెడికవర్ ఆసుప్రతి ఆధ్వర్యంలో శనివారం న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. న్యాయవాదులు నిత్యం కేసుల పర్యవేక్షణలో తీవ్ర ఒత్తిడికి గురవుతుంటారని, 24 గంటలు విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారని అలాంటి వారు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని పేర్కొన్నారు. బీపీ, షుగర్ లను కంట్రోల్ ఉంచుకోవాలని, ప్రతీరోజూ కొంత సమయం నడకకు, వ్యాయామానికి కేటాయించుకోవాలని చెప్పారు. జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖర్చుతో కూడుకున్న పరీక్షలు సైతం ఉచితంగా అందించిన మెడికవర్ సిబ్బంది సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్ ఎం ఫణికుమార్, 7వ అదనపు జిల్లా జడ్జి తిరుమలరావు, ప్రిన్సిపల్ సబ్ జడ్జి ఎం.శ్రీధర్, అడిషినల్ సబ్ జడ్జి శాంతిశ్రీ, డీఎల్ఎస్ కార్యదర్శి కె హరిబాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.అనురాగ్, జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జుమృతా బేగం కమాలుద్దీన్, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబరు గేదెల వాసుదేవరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదరరావు, జాయింట్ సెక్రటరీ భవానీ ప్రసాద్, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఉపాధ్యక్షులు ఇప్పిలి సీతరాజు, కొమ్ము రమణమూర్తి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్, మాజీ జనరల్ సెక్రటరీ వై ప్రసన్నకుమార్, మహిళా ప్రతినిధి గురుగుబెల్లి వనజాక్షి, జల్లు తిరుపతిరావు, మామిడి క్రాంతి, ఆగూరు ఉమామహేశ్వరరావు, మెడికవర్ వైద్యులు మనోజ్, ఆళ్ల భాగ్యరాజ్, సంతోష్ చైతన్య, రంగనాథ్, అమూల్య, సూర్యప్రకాష్, పల్లవి, సోనియాతో పాటు కోఆర్డినేటర్ జె చిరంజీవి, బి.నీలవేణి, కె.ప్రశాంతి, ఎం.హైమ, రేణుక, సింహాచలం పాల్గొన్నారు.



## రాజీ పడదగ్గ కేసులు

# పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

* ప్రతి పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయండి * జిల్లాలోని గ్రామాల సమాచారాన్ని సిద్ధం చేసుకోండి * ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, నవంబరు 29(వార్త):** జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో లోక్ అదాలత్ కేసులతోపాటు బెయిల్స్, రానున్న ఎన్నికల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలో గల డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డిసెంబర్ 13న జిల్లాలోని న్యాయస్థానాల్లో నిర్వహించే లోక్ అదాలత్‌లో కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్, ట్రాఫిక్, కాంపౌండు కేసులు వంటి రాజీ సాధ్యమైన కేసులను ముందుగానే గుర్తించాలని సూచించారు. ఇరు వర్గాలతో సంప్రదింపులు జరిపి, సానుకూల దృక్పథంతో, స్వీయ ఒప్పందంతో రాజీకి ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కేసుల రాజీలో పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం శాతం పెరగడం వల్ల ప్రజలకు వేగవంతమైన న్యాయం అందుతుందని తెలిపారు. రాజీ పడతగ్గ కేసు పత్రాల సిద్ధీకరణ వంటి అంశాలు ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో కొనసాగించాలని సంబంధిత అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఎన్నికలు దృష్ట్యా సున్నితమైన, అత్యంత సున్నితమైన గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి సమగ్రమైన ముందస్తు చర్యలను పర్యవేక్షించేందుకు జిల్లాలోని గ్రామాల సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామానికి సంబంధించి జనాభా వివరాలు, కమ్యూనిటీ ప్రదేశాలు, ముఖ్యమైన ప్రాంతాలు, ఇదివరకు గొడవలు జరిగే ప్రాంతాలపై సమాచారాన్ని ఖచ్చితంగా సేకరించాలని తెలిపారు. ముఖ్యమైన కేసులలో బెయిల్ విచారణ సమయంలో సంబంధిత పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో సమన్వయంతో కోర్టులో బెయిల్ వాదనలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. బెయిల్ షరతులు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పి కేవీ రమణ, డీఎస్పీలు సి.హెచ్.వివేకానంద, డి.లక్ష్మణరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.





## పోలీసు సిబ్బందికి
# కంటి అద్దాల పంపిణీ

**శ్రీకాకుళం, నవంబరు 29(వార్త):** పోలీసు సిబ్బంది కంటి ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ చేపట్టిన సంక్షేమ చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని కంప్యూటర్ కానిస్టేబుళ్లు, ఐటీ కోర్ సిబ్బంది, డీసీఆర్‌బీ సిబ్బంది, పోలీసు కార్యాలయ సిబ్బందికి సుమారు 100కు పైగా యాంటీ గ్లేర్ అద్దాలను జిల్లా ఎస్పీ అందజేశారు. విధి నిర్వహణలో కంప్యూటర్లు, సీసీటీవీ మానిటర్లు, టెక్నికల్ పరికరాలు, డేటా ఎంట్రీ పనులు, కార్యాలయ ఉత్తరప్రత్యుత్తరాలు, స్క్రీన్‌లను ఎక్కువసేపు ఉపయోగించే సిబ్బందిలో కంటి ఒత్తిడి, నీరసం, తల నొప్పి, దృష్టి మందగింపు వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఈ నేపథ్యంలో పై సమస్యలు తగ్గించడంలో సహాయపడే యాంటీగ్లేర్ అద్దాలు సిబ్బంది కళ్లను రక్షించడంతో పాటు, దృష్టి స్పష్టతను మెరుగుపరచి, సుదీర్ఘంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంచుతాయని ఎస్పీ తెలిపారు. పోలీసు సంక్షేమమే అత్యంత ప్రాధా న్యతనిచ్చే అంశమని, సిబ్బంది శారీరక–మానసిక ఆరోగ్యం మెరుగుపడితే పోలీసు సేవల నాణ్యత గణనీయంగా పెరుగుతుందన్నారు. స్టేషన్, కార్యాలయ పనితీరు సజావుగా కొనసాగేందుకు, సిబ్బంది ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా ఉంటాయన్నారు. భవిష్యత్తులో కూడా సిబ్బంది అవసరాలను గుర్తించి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, సి.హెచ్.ఏవో గోపినాథ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కళింగ కోమటి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్‌కు సన్మానం

**శ్రీకాకుళం, నవంబరు 29(వార్త):** కళింగ కోమటి



వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, డైరెక్టర్లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ సన్మానించారు. అనంతరం గోవిందరాజులు మీడియాతో మాట్లాడుతూ కళింగ కోమటి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్‌గా నియమించి నందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం 15 మంది డైరెక్టర్లతో పాటు చైర్మన్‌ను నియమించారన్నారు. నా మీద నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పగించారన్నారు. ప్రభుత్వ సహకారంతో సామాజిక వర్గం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.శ్రీకాంత్, దంప గోవిందరావు, జామి వెంకటరావు, వారణాసి మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పా రావు, పొట్నూరు కృష్ణమూర్తి, పొట్నూరు రమేష్, తూముల రమేష్, రవిశంకర్ గుప్తా, సాయిరమేశ సుంకరి, తంగుడు సంతోష్ కుమార్, కోరాడ శ్రీనివాసరావు, వారణాసి శివకుమార్, సంతోష్, కళింగ సామాజిక నాయకులు పాల్గొన్నారు.

## రైతు కోసమే కూటమి సర్కారు

**గార, నవంబరు29(వార్త) :** శ్రీకాకుళం జిల్లా గార మండలంలో పర్యటించిన కేంద్ర పౌర విమానయాన శాఖ కింజరాపు రామ్మోహన్ నాయుడు.. స్థానిక ఎమ్మెల్యే గోండు శంకర్, వ్యవసాయ శాఖా అధికారులతో కలసి గార మండల కేంద్రంలోని రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. గార సచివాలయం సమీపంలోని వరి పంట పొలాలను పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల జరిగిన ఇబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున పూర్తిగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులతో కలసి రైతులకు అందిస్తున్న ప్రభుత్వ తోడ్పాటును సమీక్షించారు. రైతుల ఆధార్ నంబర్ ను నమోదు చెయ్యడం ద్వారా రైతులు వేసిన పంట రకం, ఎంత విస్తీర్ణం లో వేసినది, వాటికి అవసరమైన మందుల వాడకం, వారికి అందిన ప్రభుత్వ సహకారం, ఇంకా భవిష్యత్ లో అందించే తోడ్పాటు.. ఇలా అన్ని విషయాలు రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఉండటం పట్ల రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. కూటమి సర్కారు పాలనలో సరైన సమయంలో అవసరమైన తోడ్పాటు అందుతూ ఉండటంతో రైతులు అంతా మంచి దిగుబడులు సాధిస్తున్నారని అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమం ద్వారా లబ్ది చేకూరని రైతులు ఎవరు అనేది స్పష్టమవ్వడంతో పాటు, వారికి సత్వర పరిష్కారం కూడా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జిల్లా అధికారులు, కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546